సాక్షి చిత్తూరు

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



వారాలపాటు వానలు..

తుపాన్ల ప్రభావంతో వారాలపాటు వానలు కురిసినా చెరువుల్లో చుక్క నీరు కూడా లేకపోవడం గమనార్హం. - 8లో



కుంటను మింగేస్తున్నారు

వందేళ్ల నుంచి పశువుల దాహార్తి తీరుస్తున్న కుంటను కొందరు ఆక్రమిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. - 8లో



వంతెన మరమ్మతులకు..

నగరిలో వర్షాలకు దెబ్బతిన్న వంతెన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్

పలమనేరు: ఏపీ సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏటా నిర్వహించే ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను స్థానిక బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 12 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 175 మంది క్రీడాకారులు వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చదరంగం, పరుగుపందాలు, హైజంప్, లాంగ్‌జంప్ పోటీల్లో పాల్గొంటారని అందులో తెలిపారు. ఇక్కడ గెలుపొందిన జట్లు ఈనెల 28న విశాఖలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు.

27న హుండీ లెక్కింపు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 7గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

భక్తులతో అమర్యాదగా ప్రవర్తించవద్దు



మాట్లాడుతున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: భక్తులతో అమర్యాదగా ప్రవర్తిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఈవో వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కొందరు ఆలయ అధికారులు, భక్తులు అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని భక్తుల నుంచి ఫిర్యాదులు అధికమయ్యాయి. దీనిపై స్పందించిన ఈవో కాణిపాకంలోని ఈవో కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. భక్తులతో అమర్యాదగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మర్యాదపూర్వంగా మాట్లాడాలని, సక్రమంగా విధులకు హాజరుకావాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శన ఏర్పాట్లు చూడాలన్నారు. వాళ్ల దగ్గర నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

> చిత్తూరు ఎస్పీ బంగ్లాకు వెళ్లే రోడ్డులో జరుగుతున్న పెద్ద కాలువ నిర్మాణపు పనులు ఇవి. దాదాపు రూ.33 లక్షల వ్యయంతో కార్పొరేషన్ నిధులను వెచ్చించి కాలువ పనులు చేస్తున్నారు. దీని లోతు ఎంత ఉండాలి..? వెడల్పు ఎంత ఉండాలి..? లోపల వేస్తున్న ఇనుప చువ్వల సైజు ఎంత..? ఒక్కో బస్తా సిమెంటుకు ఎంత ఇసుక కలుపుతున్నారు..? లాంటి ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. కాంట్రాక్టర్ చెప్పిందే లెక్క.. చూపిందే నాణ్యత. పనులు పర్యవేక్షించడానికి మునిసిపల్ సిబ్బంది ఉన్నప్పటికీ, వాళ్లకు ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానంలేదు.

చిత్తూరు ఎస్పీ బంగ్లా రోడ్డులో జరుగుతున్న కాలువ పనులు



ఎప్పుడు ప్రారంభిస్తారు?

వందకు పైగా పనులకు అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారే తప్ప, పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని కాంట్రాక్టర్లను నిలదీయడంలేదు. టెండర్లు ఎవరు దక్కించుకున్నా, నగర అభివృద్ధి జరిగితే చాలనుకునేది సామాన్యుడి ఆలోచన. కానీ చిత్తూరు నగరంలో టెండర్లు దక్కించుకున్న పనుల్లో చాలావరకు ఇంకా ప్రారంభించలేదు. 34వ డివిజన్‌లో రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, 39వ డివిజన్‌లో రూ.4.5 లక్షలతో కాలువ నిర్మాణం, 47వ డివిజన్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, 21వ డివిజన్‌లోని వరిగపల్లె పాఠశాల వద్ద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, ఇదే డివిజన్‌లో రూ.4.6 లక్షలతో లక్ష్మయ్యకండ్రిగ వద్ద కాలువ నిర్మాణం, 26వ డివిజన్‌లో రూ.6 లక్షలతో కాలువ నిర్మాణం, గాంధీ రోడ్డులో రూ.25 లక్షలతో రంగాచారి వీధి వరకు కాలువ నిర్మాణం, బాణాల వీధి, తిమ్మసముద్రం వద్ద రూ.10 లక్షలతో కాలువల నిర్మాణం లాంటి ఎన్నో పనులను ఇంకా ప్రారంభించలేదు.

- రూ.కోట్ల విలువైన పనుల్లో పర్యవేక్షణ ఏదీ..?
- నామమాత్రపు పరిశీలనతో సాగుతున్న పనులు
- ప్రజాధనంపై కనిపించని జవాబుదారీతనం
- చిత్తూరు కార్పొరేషన్‌లో ఇదీ వింత పరిస్థితి

కళ్లు మూసేసుకున్నారు!

చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిత్తూరు నగరంలో అభివృద్ధి పనుల కోసం గత నెల టెండర్లు పిలిచారు. దాదాపు రూ.8 కోట్ల విలువైన పనులు చేయడానికి వందకు పైగా పనులను గుర్తించిన అధికారులు టెండర్లు పిలిచారు. వీటిలో కొన్ని పనులకు సింగల్ టెండర్లు, మరికొన్ని పనులకు నలుగురు వ్యక్తులే మార్చి మార్చి టెండర్లు వేసుకున్నారు. అంటే అధికారులు పిలిచిన టెండర్లన్నీ తమ్ముళ్లే దక్కించుకున్నారన్నమాట. 80 శాతం పనులకు కార్పొరేషన్ అధికారులు వర్క్ ఆర్డర్లు కూడా ఇచ్చేశారు. వీటిల్లో క్షేత్రస్థాయిలో 30 శాతం పనులు జరుగుతుంటే, మిగిలిన 50 శాతం పనులు ఇంకా ప్రారంభించలేదు. పనుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు కాంట్రాక్టర్లు ఎక్కువ మందికి టెండర్లు వస్తే పనుల్లో వేగం ఉంటుంది. కానీ ఇక్కడ సింహ భాగం పనులు దక్కించుకుంది ఆరుగురు మాత్రమే. ఒక పని పూర్తిచేసి, దానికి బిల్లు వస్తే తప్ప మరో పని ప్రారంభించలేని పరిస్థితి. ఫలితంగా రూ.కోట్లలో టెండర్లు పిలిచినా, సకాలంలో పూర్తవుతాయా..? పనుల్లో నాణ్యత ఉందా..? అనే ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానాల్లేవు.

పోస్టులు వస్తేనే..

చిత్తూరును కార్పొరేషన్‌గా చేశారే కానీ, ఆ స్థాయిలో పోస్టులను భర్తీ చేయడాన్ని మరచిపోయారు. పనుల పర్యవేక్షణకు తగిన అధికారులు, సిబ్బంది లేకపోవడం గమనార్హం. ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు పర్యవేక్షించడానికి ఆరుగురు ఏఈలు ఉండాలి. కానీ ఇద్దరు మాత్రమే ఉన్నారు. నలుగురు డీఈల స్థానంలో ఇద్దరున్నారు. ఉన్నవాళ్లు అదనపు భారం మోయలేక సతమతమవుతున్నారు. పాలకులు కార్పొరేషన్‌లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి పలు పోస్టుల మంజూరుకు అనుమతులు తీసుకురావడంలో చొరవ చూపించాల్సి ఉంది.

చూసే దిక్కేది?

చిత్తూరు నగరంలో కార్పొరేషన్ సాధారణ పద్దులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రోడ్లు నిర్మించడం, కొత్తగా కాలువలు వేయడం, నీటి బోర్లు డ్రిల్ చేయడం, పైపులైన్లు వేయడం, ప్యాచ్ వర్కులు చేయడం, కొన్ని రోడ్లకు ఇరువైపులా విస్తరణ పనులు లాంటివి చేస్తున్నారు. వీటిల్లో కొన్నింటిని పర్యవేక్షిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లకు అసలు ఆ రంగంలో ఎలాంటి సాంకేతిక అనుభవం, విద్యార్హతలేదు. కానీ రూ.కోట్లు విలువ చేసే పనులను వీళ్లే సూపర్‌వైజ్ చేస్తున్నారు. మరికొన్ని పనుల్లో అసలు ఎవరూ చూసే పరిస్థితిలేదు. కాంట్రాక్టరు తీసుకొస్తున్న కమ్మీలు నిబంధనలకు లోబడి ఉన్నాయా..? సిమెంటు బస్తా ఏ గ్రేడ్‌కు చెందింది..? ఎందులో ఏం కలుపుతున్నారో తెలియడంలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే కొత్తగా నిర్మిస్తున్న రోడ్లు, కాలువలకు పదేళ్లలోనే ఆయుష్షు తీరిపోవడం ఖాయం. ప్రజాధనం కూడా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.



చిత్తూరు రిజర్వు ఫారెస్టు వద్ద పర్యవేక్షణ లేకుండా జరుగుతున్న రోడ్డు పనులు

> ఇది చిత్తూరు నగరంలోని రిజర్వు ఫారెస్టు - పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మార్గంలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులు. ఇప్పటికే ఉన్న రోడ్డును ఇరువైపులా విస్తరించడానికి రూ.కోటి పైగా నిధులు వెచ్చించి పనులు చేస్తున్నారు. దాదాపు 70 శాతం పనులు పూర్తికావస్తున్నాయి. అసలు బీటీ రోడ్డు వేయడానికి ఇసుకలో సిమెంటు ఎంత కలుపుతున్నారు..? ఎంత వెడల్పు వేస్తున్నారు..? రాళ్ల సైజు ఎంత..? అనే అంశాలను పర్యవేక్షించడానికి ఒక్కరు ఉంటే ఒట్టు...!



చిత్తూరు పీసీఆర్ విద్యా సంస్థల వద్ద జరుగుతున్న షెడ్ల నిర్మాణ పనులు

> అసలే ఆర్‌అండ్‌బీ రోడ్డు. రోడ్డుపై చిన్న గుంత తవ్వాలన్నా అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఏ అధికారీ అనుమతి ఇవ్వలేదు. రోడ్డు విస్తరణ అంటున్న కార్పొరేషన్ అధికారులు రూ.20 లక్షల వ్యయంతో చిత్తూరు పీసీఆర్ విద్యా సంస్థల ప్రహరీని ఆనుకుని షెడ్లు నిర్మించడానికి పనులు చేయిస్తున్నారు. రోడ్డుపై షెడ్లు వేసి పాత బస్టాండులో ఉన్న వ్యాపారులను అక్కడికి తరలిస్తారట. అసలు ఈ పనులను పర్యవేక్షించడానికి ఒక్క ఏఈ, డీఈ అటువైపు తొంగి చూసిందిలేదు.

చర్యలు తప్పవు

పనులు పర్యవేక్షించడానికి ప్రతి చోట వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఉంచాము. వాళ్లంతా ఏళ్ల తరబడి ఆ రంగంలో పనిచేస్తున్నారు. ఇక వర్క్ ఆర్డర్ తీసుకుని పనులు ప్రారంభించకుంటే దాన్ని రద్దుచేసి, మళ్లీ టెండర్లు పిలుస్తాం. పనుల నాణ్యతలో రాజీపడేదిలేదు. ఎక్కడైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

– వెంకటరామిరెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

ట్రై సైకిల్ కోసం దివ్యాంగుడి నిరీక్షణ



కుప్పం: రెండున్నరేళ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న వృద్ధుడు ట్రై సైకిల్ కోసం కడా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తారని కడా పీడీ వికాస్ మర్మత్‌ను కలిసేందుకు వచ్చాడు. రెండు నెలల క్రితం ట్రై సైకిల్‌ను కేటాయించాలని కోరుతూ అర్జీ ఇచ్చినా ఫలితం లేదని వాపోయాడు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీలంక కాలనీకి చెందిన అల్లాబకష్ (60) పాల వ్యాను ఢీకొని రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. నడవలేని స్థితిలో ఉన్న అల్లా బక్ష్ ట్రై సైకిల్ కోసం అధికారులకు విన్నవించుకున్నారు. రెండు నెలల క్రితం ట్రై సైకిల్ సర్దుబాటు చేస్తామని చెప్పిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిరీక్షిస్తున్నారు.

ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టండి



సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశించారు. చిత్తూరులోని పోలీసు ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి నుంచి ఫిర్యాదులు, వినతులను ఎస్పీ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ గ్రీవెన్స్‌కు 32 ఫిర్యాదులు రాగా, వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలని సూచించారు. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు.

బారులు తీరి.. అర్జీలు అందించి...

- గ్రీవెన్స్‌డేకు తరలివచ్చిన జనం
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- వివిధ శాఖలకు సంబంధించి 185 అర్జీలు నమోదు
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి 185 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను ఆయా శాఖల అధికారులు అలసత్వం వహించకుండా పరిష్కరించాలన్నారు. నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా అర్జీలు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలు అందజేసిన ప్రజలు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

మఠం భూమిని కాపాడండి



మఠం భూమిని కబ్జా చేసి ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మేస్తున్నారని కాణిపాకం, తిరువణంపల్లి, చినకాంపల్లి గ్రామస్తులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాణిపాకం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 2/1లో ఎకరా భూమిని లక్ష్మీపతి నాయుడు, ఆయన అనుచరులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలి



ఇంటి పట్టాలు మంజూరు చేయాలని వెదురుకుప్పం మండలం యనమలమంద పంచాయతీ శ్రీనివాసపురం యానాదీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన యానాదులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా గృహాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఇంటి స్థలంతో పాటు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని కోరారు.

దౌర్జన్యం చేసి గోడలు కూల్చేస్తున్నారు



గత ప్రభుత్వంలో ఇంటిస్థలం, ఇంటి పట్టా ఇచ్చారని ఆ స్థలంలో తాము నిర్మించుకున్న ఇంటి గోడలను ప్రస్తుతం జేసీబీతో కూల్చేస్తున్నారని పుంగనూరు మున్సిపాలిటీ భగత్‌సింగ్ కాలనీకి చెందిన బాధితులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులు మాట్లాడుతూ ఇళ్లు లేని తమకు గత ప్రభుత్వంలో స్థలంతో పాటు పట్టా అందజేసిందని చెప్పారు. ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 2న కొందరు జేసీబీతో వచ్చి గోడలను కూల్చేశారని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

గతంలో హామీ ఇచ్చారు



చిత్తూరు నగరంలోని హైరోడ్డు విస్తరణ విషయంలో న్యాయం చేస్తామని గతంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని హైరోడ్డు భవన యజమానులు వెల్లడించారు. సోమవారం ఆ భవన యజమానులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు హైరోడ్డు భవన యజమానుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని హైరోడ్డు విస్తరణ విషయంలో హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేతలు మొదలుపెట్టడం అన్యాయమన్నారు. తమ్ముళ్లూ.. న్యాయం చేస్తామని చంద్రబాబు గతంలో హామీ ఇచ్చారని చెప్పారు. ఇప్పుడేమో ఇలా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా భవనాలు కూల్చేస్తే సమస్యలు ఎక్కువవుతాయని కలెక్టర్ చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులును పిలిపించి చెప్పారన్నారు. భవన యజమానుల అంగీకారం తర్వాత నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ కమిషనర్‌ను ఆదేశించారన్నారు. కార్యక్రమంలో పలువురు భవన యజమానుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేణిగుంట నుంచి మూడో లైన్ అవసరం

సాక్షి, న్యూఢిల్లీ: రేణిగుంట–గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం అత్యవసరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్రానికి సూచించారు. లోక్‌సభ జీరో అవర్‌లో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలను కేంద్రం దృష్టికి తెచ్చారు.

జన్‌సమర్థ్‌కు 45,869 దరఖాస్తులు

సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు 'జన్ సమర్థ్' అనే పోర్టల్‌ను కేంద్రం తీసుకొచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ ఎంపీ పి.వి.మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ పోర్టల్‌కు ఏపీ నుంచి ఇప్పటి వరకు 45,869 దరఖాస్తులు అందినట్లు మంత్రి చెప్పారు.

ఏనుగు దాడిలో దూడ మృతి



గంగవరం: ఏనుగు దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం వెలుగుచూసింది. బాధితుల కథనం మేరకు మండలంలోని కీలపట్ల పంచాయతీ బండమీద జరావారిపల్లి సమీపంలో పొలాల వద్ద రెడ్డెప్ప కుటుంబం నివసిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి ఏనుగు గొడ్ల పాకలో చొరబడి కట్టేసిన పాడి ఆవు, దూడపై దాడి చేసింది. దీంతో ఆ దూడ మృతి చెందింది. ఆవు కట్టిన దారం తెంచుకుని పారిపోయింది. ఇదే ఏనుగు వారం క్రితం అర్ధరాత్రి వేళ చొరబడి వీరి ఇంటి గోడలు ధ్వంసం చేసింది. ఇలా తరచూ ఒంటరి ఏనుగు దాడిలో ఆస్తి, ప్రాణ నష్టాలు జరగడంపై బాధితులతో పాటు స్థానిక రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.



మట్టిని తోడేయడంతో కనిపించకుండా పోయిన కామిరేపల్లి చెరువు



చుక్కనీరు లేని మొరం చెరువు

వారాల పాటు వానలు..

చెమ్మలేని చెరువులు!

- ఆక్రమణలో సప్లయ్‌చానళ్లు
- 90 శాతం చెరువుల్లో చుక్కనీరు లేదు
- అటు మట్టి మాఫియా.. ఇటు ఇసుకాసురులు
- వెంచర్లుగా మారుతున్న ఆయకట్టు భూములు

పలమనేరు: నాడు రాజులు చెరువులను తవ్వించి రైతులకు మేలు చేశారు. ఇప్పుడు ఉన్న చెరువులను నాశనం చేస్తున్నారు. చెరువుకు నీరు వచ్చే మార్గాలైన సప్లయ్ చానళ్లు, వాగులు, వంకలు ఆక్రమణలకు గురై వర్షపునీరు చెరువుల్లోకి చేరకుండా పోతోంది. ఇక చెరువులో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాలకు మట్టికోసమని చెరువులను చెరబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాక పలమనేరు నియోజకవర్గంలో మట్టి మాఫియా, ఇసుకాసురులు బాగున్న చెరువులను సర్వనాశనం చేసేస్తున్నారు. తుపాన్ల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నా నీరు మాత్రం చెరువుల్లోకి చేరని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయకట్టు భూముల్లో పంటలు సాగు కావడం లేదు. ఎందుకీ తలనొప్పంటూ ఆయకట్టు రైతులు తమ భూములను తెగనమ్ముకుంటారు. పచ్చని పంటలతో కళకళలాడే కీలేర్లు నేడు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయి. ఇలాగే చెరువులు నాశనమైతే భవిష్యత్తులో తిండిగింజలకు సైతం ఇబ్బందులు తప్పేలాలేవు.

ఇటీవల తుపాన్లు వరుసగా వస్తున్నాయి. వానలు వారాలపాటు కురుస్తున్నాయి. అయినా చెరువుల్లో మాత్రం చుక్కనీరు కానరాలేదు. ఒక పక్క మట్టి మాఫియా చెరువులను లోయలుగా తవ్వి వాటి రూపురేఖలను మార్చేసింది. మరోవైపు ఇసుకాసురులు వాగులు, వంకలు, నదులన్నింటిలో ఇసుకను తోడేసి తరలించుకుపోతున్నారు. అందరూ అధికార పార్టీ వారే కాబట్టి అధికారులు చేతులు ముడుచుకు కూచున్నారు. చెరువులన్నీ అక్రమార్కుల చెరలో చిక్కుకుపోయాయి. అక్కడ నీటి జాడ కనిపించడం లేదు. ఫలితంగా పచ్చని పంట పొలాలన్నీ రియల్ వెంచర్లుగా మారుతున్నాయి. ఇక ముందు ఎలాంటి దయనీయ పరిస్థితులు ఎదురవుతాయోనని అన్నదాతలు తల్లడిల్లిపోతున్నారు.

ఇదీ చెరువుల పరిస్థితి

పలమనేరు నియోజకవర్గంలో మొత్తం 787 చెరువులున్నాయి. వీటిల్లో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు (100 ఎకరాల విస్తీర్ణం) 57 దాకా ఉన్నాయి. 97 శాతం చెరువులు పూర్తిగా నీరులేక ఎండిపోయాయి. దీంతో ఈ చెరువుల కింద ఆయకట్టు 20 వేల హెక్టార్లుగా ఉండగా రైతులు 2 వేల హెక్టార్లలో పంటలను సాగుచేశారు. పలమనేరు పెద్ద చెరువు, బొమ్మిదొడ్డి చెరువుల కింద ఏటా మూడు పంటలు పండేవి. కానీ ఇప్పుడు కీలేర్లలోని ఆయకట్టు భూముల్లో సైతం రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి.



బొమ్మిదొడ్డి చెరువుకీలేరులో రియల్ వెంచర్లు

ఎక్స్‌ప్రెస్‌హైవే పేరుతో చెరువులు నాశనం

నియోజకవర్గంలోని వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేరు మండలాల్లో చెన్నై– బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు సాగుతున్నాయి. ఈ పనులకు అవసరమైన మట్టికోసం ఆయా రోడ్డు సమీపాల్లోని 30 చెరువులను కాంట్రాక్టర్లు హిటాచీలు, జేసీబీ వాహనాలు పెట్టి వేలాది టిప్పర్ల లోడ్ల మట్టిని తరలిస్తున్నారు. దీంతో వానలు పడి వరదనీరు చెరువుల్లోకి చేరినా చుక్కనీరు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది.



బైరెడ్డిపల్లి చెరువులో మట్టి తవ్వకాలు (ఫైల్)

అధికార పార్టీ నేతల అక్రమాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరునెలల్లో చెరువులు సర్వనాశనం అయ్యాయి. రియల్ ఎస్టేట్‌ల కోసం చెరువుల్లోని మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. మరోవైపు చెరువుల్లోని ఇసుక కోసం మట్టిని తవ్వి దానికిందుండే ఇసుకను తోడేస్తున్నారు. ఇలా నిత్యం వేలాది లోడ్ల మట్టి, ఇసుక అక్రమార్కులపాలవుతోంది.

చోద్యం చూస్తున్న సంబంధిత శాఖలు

చెరువులకు సంబంధించి ఎంఐ ట్యాంకుల పర్యవేక్షణ ఇరిగేషన్ శాఖ, చిన్న చెరువులు ఆయా మండలాలు, సంబంధిత పంచాయతీలు చూసుకోవాలి. కానీ చెరువుల్లో మట్టిని, ఇసుకను తోడుకుంటున్నా తమకేమీ సంబంధం లేదన్నట్టు ఆయా శాఖలు వ్యవహరిస్తున్నాయి. దీంతో అక్రమార్కులు తాము ఆడిందే ఆట అన్నట్టుగా ఏమాత్రం భయం లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు.

మా చెరువును నాశనం చేసేశారు



మా గ్రామానికి ఆధారమైన చెరువును నాశనం చేసేశారు. కొందరు టౌన్‌లో రియల్ ఎస్టేట్‌కు మట్టికోసం భారీగా గుంతలు తవ్వారు. మరికొందరు పట్టణంలోని వ్యర్థాలను మా గ్రామ చెరువులో పడేస్తున్నారు. ఎన్ని వానలు వచ్చినా చెరువులో నీరు నిల్వలేని పరిస్థితిని తెప్పించారు. ఇటీవల మా గ్రామస్తులంతా మాట్లాడి చెరువును కాపాడుకుందామని అనుకున్నాం.

– గోవిందురెడ్డి, బేరుపల్లి, పలమనేరు మండలం

చూస్తా ఉంటే కడుపు మండుతోంది



ఏ గ్రామంలోని చెరువు నన్నా చూడు మట్టికోసం గుంతలను తవ్వేశారు. చెరువుల్లోకి నీరు వచ్చే మార్గాలను భూముల్లోకి కలిపేసుకున్నారు. చెరువుల్లోని బంకమట్టిని మొత్తం తోడేస్తే వాన నీరు వచ్చినా చుక్కకూడా చెరువులో నిల్వ ఉండదు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థమే కాలేదు.

– విజయశంకరస్వామి, కీలపట్ల, గంగవరం మండలం


యూట్యూబ్‌లో సమ్మేటివ్ ప్రశ్నపత్రాలు

- గణిత పరీక్షను రద్దు చేసిన విద్యాశాఖ
- పరీక్షలు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారంటూ విద్యార్థి సంఘాల ఆగ్రహం
- నేటి నుంచి యథాతథంగా పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించాల్సిన సమ్మేటివ్ గణిత పరీక్ష ప్రశ్నా పత్రాలు యూట్యూబ్‌లో దర్శనమివ్వడంతో ఆ పరీక్షను విద్యాశాఖాధికారులు వాయిదా వేశారు. కూటమి సర్కారు పాలనలో సమ్మేటివ్–1 పరీక్షలనే పకడ్బందీగా నిర్వహించడంలో విఫలమయ్యారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. మార్చిలో నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఎంత మాత్రం నిర్వహిస్తారోనని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. గణిత ప్రశ్నాపత్రం సోమవారం లీక్ కావడంతో జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లోని 2,876 పాఠశాలల్లో పరీక్షను వాయిదా వేశారు.

లీకేజీ అనంతరం హడావుడి

దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు సమ్మేటివ్ పరీక్షల గణితం ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన తరువాత విద్యాశాఖ అధికారుల హడావుడి చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ప్రశ్నాపత్రాలను ఆగమేఘాలపై తీసుకొచ్చి ఆయా మండలాల్లోని పోలీసు స్టేషన్‌లలో భద్రపరచాలని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో సోమవారం సాయంత్రం జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న హెచ్‌ఎంలు ప్రశ్నాపత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించే పరీక్షలకు సంబంధించి ఏ రోజుకారోజు ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాలని డీఈవో వరలక్ష్మి ఎంఈవోలను సోమవారం ఆదేశించారు.



All RJDs/DEOs.

Urgent instructions.
Today's morning SA-1, Mathematics exam is postponed with immediate effect.

Ensure that the message reaches all schools.

It has come to our notice that the Mathematics paper is circulated in YouTube wi by some miscreants. It is also circulated in WhatsApp and telegram.

We have taken the issue very seriously at state level.
Ensure that the message is sent to all schools.

Take strict measure for tomorrow question paper distribution.
Regards
Director,SCERT

గణిత పరీక్షను వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు వాట్సాప్‌లో పంపిన సమాచారం

వాయిదా పరీక్షల తేదీల్లో అయోమయం

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు సమ్మేటివ్ పరీక్షల టైం టేబుల్‌లో గందరగోళం నెలకొంది. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండు రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అయితే ఆ సెలవు రోజుల్లో నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. దీంతో పాటు ఈ నెల 16న నిర్వహించాల్సిన గణితం పరీక్ష ప్రశ్నాపత్రం లీకవ్వడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే వాయిదా వేసిన పరీక్షలను తదుపరి ఏ తేదీల్లో నిర్వహిస్తారో విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇవ్వడంలో విఫలమయ్యారు. దీంతో విద్యార్థులకు ఏ రోజు ఏ పరీక్ష నిర్వహిస్తారో తెలియక తికమకపడుతున్నారు. ఇప్పటి వరకు వాయిదా వేసిన పరీక్షల తేదీలను తెలియజేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

ఐరాల: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా డీఎల్‌పీఓ పార్వతి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రభుత్వం చేపట్టిన సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనలో భాగంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఎల్‌పీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, సర్పంచులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి గానూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. శిక్షణ అంశాలపై ఈఓపీఆర్డీ కుసుమకుమారి అవగాహన కల్పించారు. ఈటీసీ శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ నాగపద్మజ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ అవార్డు పొందిన బొమ్మసముద్రం సర్పంచ్ రఘును డీఎల్‌పీఓ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ పార్వతి

కుంటను మింగేస్తున్నారు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వందేళ్ల నుంచి పశువు దాహార్తి తీర్చుతున్న కుంటను కొందరు ఆక్రమణదారులు మింగేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఐరాల మండలం కాణిపాకం గ్రామ రెవెన్యూ దాఖల సర్వే నంబర్ 2/1లో ఉన్న కుంటను కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కాణిపాకం, తిరువణంపల్లె, చినకాంపల్లె గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు తెలిపిన సమాచారం మేరకు, ఈ సర్వే నంబర్‌లో సుమారు 40 కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయడంలో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. అదే సర్వే నంబర్‌లో ఒక ఎకరా భూమి ఉంది. ఆ భూమిలో చుట్టుపక్క గ్రామాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల వారు పశువుల దాహార్తి కోసం కుంటను నిర్మించుకున్నారు. సమీప బావుల్లో నీరు అడుగంటిపోయినప్పటికీ ఈ కుంటలో నీరు ఎప్పటికీ ఇంకి పోకుండా అలానే ఉంటుంది. సుమారు వందేళ్ల నుంచి ఆ కుంట పశువుల, గొర్రెలు, మేకల దాహార్తి తీర్చుతోంది. అయితే ఇటీవల కొంతమంది ఈ కుంటపై కన్నేశారు. దీన్ని చదును చేసి వెంచర్‌గా మార్చడానికి పనులు మొదలెట్టేశారు. అయితే కబ్జాదారుల నుంచి వందేళ్ల చరిత్ర కలిగిన ఈ కుంటను కాపాడానికి వారు విన్నవించుకున్నారు. ఈ న్యాయం చేయాలని కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు వారు వివరించారు.

పకడ్బందీగా మాతా శిశు సంరక్షణ సేవలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాతా శిశు సంరక్షణ సేవలను పకడ్బందీగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి అన్నారు. చిత్తూరు నగరంలోని మాతా శిశుసంరక్షణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గర్భిణుల నమోదులో ఆలస్యం ఉండకూడదన్నారు. వారు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలని ఆమె పేర్కొన్నారు.

వైఎస్ జగన్ ముందస్తు జన్మదిన వేడుకలు



దివ్యాంగ బాలుడి చేతుల మీదుగా కేక్ కట్ చేస్తున్న కృపాలక్ష్మి

గంగాధర నెల్లూరు: వైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదు అని గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు (ఈ నెల 21వ తేదీ) సందర్భంగా ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని ఆశాజ్యోతి దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీలో సోమవారం అన్నదానం చేశారు. అక్కడే ఉన్న దివ్యాంగ పిల్లలతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నగరి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : సొంత లాభాల కోసం బాధ్యత మరచిన నగరి ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ నియోజకవర్గ టీడీపీ నాయకుడు రామానుజం చలపతి డిమాండ్ చేశారు. చిత్తూరులో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని, చెవుల్లో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతి పత్రం అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో దోపిడీ దొంగలపై చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎర్రచందనం, సారా, గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక దోపిడీ వంటి అక్రమాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని చెప్పారు. అయినప్పటికీ నగరి ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదన్నారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే మౌనం వెనుక ఉన్న మర్మం ను నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఈ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నగరి నియోజకవర్గ ప్రజలు అలిమేలు, రాధ, భారతి, హేమ, ఉమ, గజేంద్ర, వసంత్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టీడీపీ నేత రామానుజం

విద్యార్థులకు గైడ్స్ ఇస్తే చర్యలు తప్పవు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గైడు విధానం అమలు చేస్తే సంబంధిత టీచర్‌పై కఠినంగా చర్యలుంటాయని వైఎస్సార్ కడప జిల్లా పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ హెచ్చరించారు. ఆయన సోమవారం డీఈవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆర్జేడీ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులే విద్యార్థులకు గైడుగా ఉండాలన్నారు. అంతేతప్ప విద్యార్థులకు గైడ్లు తెచ్చుకోవాలని పలు చోట్ల టీచర్లు చెబుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తన తనిఖీల్లో ఇదే నిజమని తేలితే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. వచ్చే ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన 90 రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

ఆలస్యంగా బడులకు వస్తే వేటు ఖాయం

టీచర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆర్జేడీ తెలిపారు. ఉదయం ఆలస్యంగా రావడం..సాయంత్రం త్వరగా వెళ్లిపోవడం చేస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. వీరిపై హెచ్‌ఎంలు సక్రమంగా పర్యవేక్షించాలన్నారు. డీఈవో కార్యాలయంలో 3 రోజుల పాటు తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీచర్ల ఉద్యోగోన్నతుల ప్రక్రియ, ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, టీచర్లకు సంబంధించిన సర్వీసు విషయాలు తనిఖీ చేసి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు నివేదికలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ పరశురామనాయుడు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేటివ్ పరీక్షల నిర్వహణపై కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

నీటి సంఘాల ఎన్నికపై అభ్యంతరాలు

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా చేపట్టారని మండలంలోని పెద్దబంగారు నత్తం గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కడా పీడీ వికాస్ మరమ్మత్‌కు వినతిపత్రం అందజేశారు. పెద్దబంగారునత్తం చెరువు ఆయకట్టు సుమారు 500 ఎకరాలకు పైగా ఉందన్నారు. ఆయకట్టులో ఉన్న రైతులను పక్కన పెట్టి భూములు లేని వ్యవసాయం తెలియని వారికి నీటి సంఘాల కమిటీలో చోటు కల్పించడం ఎంత వరకు సమంజసమంటూ నిలదీశారు. రెండు రోజుల క్రితం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో తాము అభ్యంతరం వ్యక్తం చేస్తే పోలీసు బలగాలతో మమ్మల్ని బెదిరించారని ఆవేదన చెందారు. ఈ ఎన్నికలను రద్దు చేసి నిజమైన రైతులకు ఆయకట్టు దారులకు నీటి సంఘాల ఎన్నికల్లో చోటు కల్పించి పిబినత్తం చెరువు అభివృద్ధికి కృషి చేయాలని ఆయన్ను కోరారు.



పీడీకి వినతిపత్రం అందించడానికి వచ్చిన పెద్దబంగారు నత్తం గ్రామస్తులు

వంతెన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి

నగరి : మున్సిపల్ పరిధి కీళపట్టు మార్గంలో నదీ ప్రవాహంలో కొట్టుకుపోయిన వంతెనను కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే భాను ప్రకాష్‌తో పాటు కలిసి పరిశీలించారు. అనంతరం రోడ్లు భవనాల శాఖ అధికారులతో చర్చలు జరిపారు. లోతట్టు వంతెనకు మరమ్మతులు చేపట్టి రోడ్డు నిర్మించడానికి అంచనాలు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నదిలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భవానీశంకరి, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

375 బస్తాల రేషన్ పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన లారీ

పుత్తూరు: నగరి నుంచి కర్ణాటకలోని బంగారుపేటకు అక్రమంగా తరలిస్తున్న 375 బస్తాల రేషన్ బియ్యాన్ని పుత్తూరు పోలీసులు పట్టుకున్నారు. సీఐ సురేంద్రనాయుడి కథనం మేరకు, సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మండల పరిధిలోని పరమేశ్వరమంగళం వద్ద లారీలో రేషన్ బియ్యాన్ని గుర్తించారు. సుమారు రూ.8.62 లక్షల విలువ చేసే 375 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, గోడౌన్‌కు తరలించామన్నారు. తమిళనాడులోని కనకమ్మసత్రం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ యువరాజ్(31)ని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.